
94931 70689 | www.rajadhanivartalu.com | rajadhanivartalu | rajadhaniv | RNI No. APTEL 2015/ 66622 | స్థాపితం : 2015 | Postal Regd No: GTR/84/2016-18






# రాజధాని వార్తలు

Voice of Voiceless



అమరావతి సంపుటి : 3 సంచిక 27, పేజీలు 4 వెల: రూ. 2.00 | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక | సోమవారం 26- ఆదివారం 1 ఏప్రిల్, 2018


# 14న చెన్నైకి మోడీ

## డిఫెన్స్ ఎక్స్‌పోను ప్రారంభించనున్న ప్రధాని



**చెన్నై :** కేంద్ర రక్షణశాఖ ఆధ్వర్యంలో వచ్చే నెల 14 నుంచి మూడు రోజుల పాటు జరుగనున్న డిఫెన్స్ ఎక్స్‌పో ప్రారంభోత్సవానికి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చెన్నై రానున్నారు. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మహాబలిపురం సమీపం లోని తిరువిడంద్రై ప్రాంతంలో ఈ ప్రదర్శన ఏర్పాటు కానుంది. ఇందు కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగు తున్నాయి. దేశ రక్షణశాఖ ఆధ్వర్యంలో డిఫెన్స్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్‌తో పాటు డిఫెన్స్ ఎక్స్‌పో 2018 జరుగనుంది. ఇందుకోసం కేంద్రం రూ. 450 కోట్లు కేటాయించింది. ఈ ప్రదర్శనకు 80 దేశాలకు చెందిన రక్షణవిభాగ ప్రతినిధులు హాజరుకానున్నారు. ఈ సదస్సు భద్రతా చర్యల్లో భాగంగా కాంచీపురం జిల్లా ఎస్పీ సంతోష్ హాతీమణి శుక్రవారం మహాబలిపురంలోని హెూటల్స్, లాడ్జీలు, అతిథి గృహాలు, రిసార్ట్స్‌లకు చెందిన యజమానులతో సమీక్షా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సదస్సు జరిగే సమయానికి పది రోజుల ముందు నుంచే హెూటల్స్, లాడ్జీలు, రిసార్టులలో బస చేసే వారి వివరాలను సేకరించాలని ఆదేశించారు. అలాగే, సీసీ టీవీ కెమేరాలను విధిగా ఏర్పాటు చేయాలని, బస చేసే వారి నుంచి ఆధార్ కార్డు జిరాక్స్ కాపీతో పాటు ఫోన్ నంబరు తదితర వివరాలను సేకరించాలని ఎస్పీ వారిని ఆదేశించారు.

# అమిత్‌షావి కట్టుకథలు..



**అమరావతి :** బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా లేఖపై సీఎం చంద్రబాబు ఘాటుగా స్పందించారు. అమిత్‌షా లేఖ అంతా కట్టుకథలు.. అసత్యాలని చంద్రబాబు కొట్టిపారేశారు. అమిత్ షాకు తప్పుడు సమాచారం అందిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర హక్కులపై కేంద్రమంత్రులకు చాలా లేఖలు రాశాననో, అసత్యాలు ఎందుకు చెప్పాల్సి వస్తుందని అడుగుతున్నానని బీజేపీ నేతలను ప్రశ్నించారు. ఈఏపీ ఇస్తామని చెప్పారని, ఒక్క పైసా ఇవ్వలేదని చంద్రబాబు మండిపడ్డారు. ఏపీకి కేంద్రం ఇచ్చిన ఆయా ప్రాజెక్టుల వివరాలను మొత్తం 9 పేజీల్లో ఓ లేఖ రూపంలో అమిత్‌షా చంద్రబాబుకు పంపిన విషయం తెలిసిందే. ఏపీ అభివృద్ధికి కేంద్రం అన్ని రకాలుగా సాయం చేసిందని ఆ లేఖలో అమిత్‌షా పేర్కొన్నారు. అలాగే ఏపీకి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుతున్నామని, 3 ఎయిర్‌పోర్టులను అంతర్జాతీయ విమానాశ్రయాలుగా మార్చామన్నారు. కొత్త రైల్వేలైన్ నిర్మాణానికి నిధులు కేటాయించామని, ఏపీకి కేంద్ర విద్యాసంస్థలు, ఎయిమ్స్ నెలకొల్పామని ఆ లేఖలో అమిత్‌షా వివరించారు.

### తప్పులుంటే చెప్పండి..



ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆరోపణలపై మంత్రి లోకేష్ స్పందించారు. నీళ్ల టాంకర్ల విషయంలో అవినీతి జరిగిందని, సోమువీర్రాజు ఆరోపణలు చేయడం సరికాదని హితవుపలికారు. వాటర్ ట్యాంకర్ల విషయంలో అవినితి జరిగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. "ఏం జరిగినా నా డ్యాష్ బోర్డులో కనిపిస్తాయి. ఉపాధి హామీ నిధుల్లో అవినీతి జరిగితే 20 అవార్డులు ఎందుకు వస్తాయి?. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అవార్డులు ఎందుకు రాలేదు?. రోజుకు 15గంటలు కష్టపడుతున్నా.. అవినీతి ఆరోపణలు బాధ కలిగిస్తున్నాయి. ప్రతి చిన్న విషయానికీ అవినీతి అనడం సరికాదు. తప్పులుంటే బీజేపీ నేతలు చెప్పండి.. సరిచేసుకుంటా" అని లోకేశ్ కోరారు.

### ఏపీ బీజేపీపై టీడీపీ ఎంపీ ఫైర్..



ఏపీ బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీ కొనకళ్ల నారాయణ ఫైర్ అయ్యారు. ఏపీ బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కౌన్సిలర్‌గా కూడా గెలవలేరని, సోము వీర్రాజుకు ఎమ్మెల్సీ పదవి టీడీపీ వల్లే వచ్చిందన్న విషయాన్ని ఆయన గుర్తుంచుకోవాలన్నారు. అలాగే... అమిత్‌షా అవగాహన లేకుండా లేఖ రాశారని, ఏపీకి ఏం చేశారో పార్లమెంట్‌లో చెప్పాలని.. లేఖల్లో కాదు అని కొనకళ్ళ అన్నారు.

### ఒంటిమిట్ట రామయ్య

# బ్రహోత్సవాలు



సీతాలక్ష్మణ సమేత ఒంటిమిట్ట కోదండరాముడు

**ఒంటిమిట్ట :** కడప జిల్లా ఒంటిమిట్టలోని కోదండ రామాలయ వార్షిక బ్రహోత్సవాలు శనివారం రాత్రి అంకురార్పణ చేశారు. ఇందుకోసం ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈనెల 25న ధ్వజారోహణం నిర్వహిస్తారు. 25 నుంచి ఏప్రిల్ 1 వరకు వివిధ వాహన సేవలు జరుగుతాయి. 30న ఉదయం శివధనుర్బాణాలంకారం, సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 31న రథోత్సవం ఉంటుంది. 2న ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, 3న పుష్పయాగాన్ని వేడుకగా నిర్వహించనున్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు గవర్నరు నరసింహన్, ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నందున పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

### 27న కాంగ్రెస్

# అవిశ్వాసం

- నోటీసు అందజేసిన మల్లికార్జున ఖర్గే
- పీసీసీ అధ్యక్షులు రఘువీరారెడ్డి



**హైదరాబాద్ :** ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న మోడీ ప్రభుత్వంపై ఈనెల 27న కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతోందని పిసిసి అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ లోక్‌సభా పక్షనాయకుడు మల్లికార్జున ఖర్గే స్పీకర్‌కు నోటీసులు కూడా అందజేశారన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ రాజీ లేకుండా పోరాడుతోందన్నా. కోటి పంతకాల సేకరణ, మట్టిసత్యాగ్రహం, ప్రజా బ్యాలెట్, ధర్నాలు, దీక్షలు చేపట్టామని గుర్తు చేశారు. మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు ఢిల్లీలో రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు, ఆత్మగౌరవ దీక్షలు చేపట్టామని తెలిపారు. వచ్చే సాధారాణ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే... మొదటి ప్రాధాన్యతగా హోదా అమలు చేస్తుందన్నారు. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ స్వయంగా ప్రకటించడంతో టిడిపి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలతో పాటు ఇతర పార్టీలు హోదా పై మాట్లాడటం మొదలు పెట్టాయని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో రూల్ 184 కూడా నోటీసు ఇవ్వగా దాన్ని కూడా చర్చకు రాకుండా మోదీ ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. అవిశ్వాసంపై మోడీ ప్రభుత్వం నేరగ్రస్థగా మాదిరిగా పారిపోతుందని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి శైలజానాథ్, ఉపాధ్యక్షులు సూర్యనాయక్, ప్రధాన కార్యదర్శి జంగా గౌతమ్, లీగల్ సెల్ చైర్మన్ సుందర రామ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# అందమైన బ్యాగులు



**రాజధాని ప్రతినిధి, విశాఖపట్నం :** పాతచీరలతో కూడా అందమైన బ్యాగులు కుట్టవచ్చు. ఈ విషయాన్ని వృత్తి, నైపుణ్యం శిక్షకురాలు జె. రమా రుజువు చేస్తున్నారు. పాత పడిన చీరలు, దుప్పట్టా లలో అందమైన బ్యాగులు తయారు చేస్తు, ఈ ప్రాజెక్టును హెల్త్ ఇంజనీర్‌గా నామకరణం చేశారు. ఈ బ్యాగుల వాడకంతో ప్లాస్టిక్ బ్యాగులను తగ్గించవచ్చని వివరించారు. తద్వారా పర్యావరణానికి రక్షించవచ్చున్నారు. మహారాష్ట్రకు చెందిన ఇందిరాగెక్వాడ్ గురించి ప్రచురించిన (2014)లో వ్యాసంతో తాను ప్రేరణిపొందానని రమా తెలిపారు. ఆ వ్యాసంలో క్రీడా ప్రావిణ్యాలకు మహారాష్ట్ర ప్రభుత్వం అందించిన అత్యంత ప్రతిషాత్మకమైన శివ్ ఛత్రపతి పతకాన్ని తల్లి వైద్య ఖర్చులకు అమ్మావని చెప్పడం బాధాకరంగా అనిపించిందని, ఆమె నుంచి స్ఫూర్తి పొంది బ్యాగులు తయారు చేస్తున్నానన్నారు. తన బ్యాగులపై ఇందిరా గైక్వాడ్ సంతకాన్ని, అరచేతిని ప్రచురిస్తున్నారు ఆమెకు 2 లక్షలు సమకూర్చునన్నారు. ఇప్పటి వరకు రూ.90 వేల బ్యాగులు చేస్తారన్నారు. ఒక్కొక్క బ్యాగు తయారికి రూ.7 ఖర్చు అవుతుందని రూ.5 కే అమ్మి రూ.2 ను తన బాధ్యతగా పర్యావరణానికి సహాయంచేస్తున్నాన్నారు. బ్యాగుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని గుంటూరులో 6 గురు మహిళలకు, అనకాపల్లిలో ఇద్దరు మహిళకు సహాయం చేస్తున్నారు.

# ఆర్టీసి ఎండీగా సురేంద్రబాబు

- అక్టోపస్ అడిషనల్ డీజీ నుంచి పదోన్నతి
- ఉత్తర్వులు వెలువరించిన ప్రభుత్వం



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఎపిఎస్ ఆర్టీసి మేనేజింగ్ డైరెక్టర్ (ఎండి)గా 1987 ఐపిఎస్ బ్యాచ్‌కు చెందిన ఎన్‌వి సురేంద్ర బాబును రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషినల్ డిజిగా ఉన్న సురేంద్ర బాబుకు పదోన్నతి కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. 2001 నుంచి 2004 మధ్య విజయవాడ కమిషనర్‌గా పనిచేశారు. 2006-2007 మధ్యలో హైదరాబాద్ సిటీ పోలీస్ అడిషనల్ కమిషనరేట్‌లో కో ఆర్డినేషన్ విభాగంలో సేవలందించారు. అంతకుముందు హైదరాబాద్ సిటీ పోలీస్ విభాగంలో ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్‌గా పని చేశారు. 2007లో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదోన్నత పొందారు. 2008లో మక్కా మసీదు బాబింగ్ కేసులో ఏపీ పోలీస్ దళం సభ్యులుగా ఉన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్‌గానూ, ఎక్సైజ్ శాఖలోనూ పని చేశారు. వరంగల్ ఎన్ఐటి నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన ఆయన ముంబైలో ఎంటెక్ చేసి డెహ్రాడూన్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో ఎస్పి శిక్షణ పొందారు. నల్లమలలోని గ్రే హౌండ్స్ అకాడమీలో మావోయిస్టు వ్యతిరేక శిక్షణను పూర్తి చేశారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియాలో ఫెలోషిప్ చేశారు. కృష్ణా జిల్లా క్రికెట్ అసోసియేషన్‌కు గౌరవాధ్యక్షురాలుగానూ ఉన్నారు. ఆయనకు 2003లో రాజీవ్ సర్వీస్ మెడల్ కూడా లభించింది.


బీజేపీకి వ్యతిరేకంగా మహాకూటమి... 2లో

కెమెరా 'ఉమెన్' జయశ్రీ 3లో

అమెరికా కంటి నలుసు 'పుతిన్' 4లో











### నష్టపోయిన రైతన్నలకు

# రూ.2, రూ.5 చెక్కులు




**చెన్నై:** తమిళనాడులోని దిండుగల్ జిల్లాలో వర్షాలు లేక నష్టపోయిన రైతులకు పంటల బీమా పథకం కింద రూ.2, రూ.5, రూ.18 విలువ చెక్కులు పంపిణి చేయడంతో వారు ధిగ్భ్రాంతి చెందారు. కరవు కారణంగా పంటలు పండించుకోలేని రైతులు జాతీయ పంట బీమా పథకంలో సభ్యులుగా చేరి రూ.610 నుంచి రూ.2 వేల వరకు ప్రీమియం చెల్లించారు. వీరికి ప్రక ృతి వైపరీత్యాలు సంభవించే కాలంలోను, కరవు రోజుల్లో రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పరిహారం చెల్లించనున్నట్లు కేంద్రం ప్రకటించింది. దిండుగల్ జిల్లా చత్రపట్టి, బోడువారిపట్టి, వేలూరుఅన్నపట్టి, విరాళపట్టి, విరుపాక్షి, మంచనాయకన్‌పట్టి, కొత్తయం తదితర ప్రాంతాల్లో తక్కువ నీటితో పండించుకోగలిగే మొక్కజొన్న పంటను రైతులు సాగుచేశారు. అయితే, వర్షాలు కురవకపోవడంతో పంట ఎండిపోయి నష్టపోయిన రైతులకు బోడవారిపట్టి ప్రాంతంలో ఉన్న ఓ జాతీయ బ్యాంక్ యాజమాన్యం అన్నదాతలకు శుక్రవారం ఉదయం చెక్కులను పంపిణి చేసింది. రైతులు ప్రీమియంగా చెల్లించిన దాని కంటే అతి తక్కువగా రూ.2, రూ.3, రూ.5, రూ.18 విలువ చెక్కులను అందజేశారు. ఈ చెక్కులను మార్చుకోవాలంటే ఒక్కొక్కరు రూ.150 వరకు వెచ్చించాల్సి ఉంది. దీంతో ధిగ్భ్రాంతికి గురైన రైతులు, తమను భిక్షగాళ్ల కంటే హీనంగా చూస్తున్నారని ఏకరువు పెట్టారు.




# మొబైల్ టాయిలెట్స్

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** ఏపీఎస్ ఆర్టీసి నూతన ప్రణాళికను అమలు చేయబోతోంది. ఇందులో భాగంగా పాత బస్సులను సంచార మరుగుదొడ్లగా వినియోగించనుంది. ప్రయాణికులను చేర్చటానికి పనికి రాని బస్సులకు చిన్న మార్పులు, మరమ్మతులు చేసి మరుగుదొడ్డిని అమరుస్తున్నారు. దాదాపు రెండు లక్షల రూపాయలు ఖర్చువుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ సంచార టాయ్‌లెట్స్ బస్సులను మున్సిపల్‌కార్పొరేషన్‌లు గా పంచాయితీలు ఆర్.టి.సి నుండి కోనుగోలు చేయావచ్చున్నారు. తీర్థాలు, ఉత్సవాల సమయంలో వీటిని వాడటంతో బహిరంగ మలవిసర్జను నివారించి స్వచ్ఛాంధ్ర మిషన్‌కు సహకరించాలని అధికారులు కోరుతున్నారు. శివరాత్రి పండుగకు కోటప్పకొండలో మొబైల్ టాయ్‌లెట్స్ బస్సులకు ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందిన్నారు. గుజరాత్ రోడ్డు రవాణాసంస్థ విజయవంతంగా మొబైల్ టాయ్‌లెట్స్‌ను నిర్వహిస్తుందని అదే తరహాలో ఆంధ్రలో ఎ.పి.యస్.ఆర్.టి.సి ఈ నూతన ఆలోచనను అమలు పరుస్తుందని ఆర్.టి.సి మేనేజింగ్ డైరెక్టర్ ఎం మాలకొండయ్య తెలిపారు.

# భారత్ రాబోము : నీరవ్ మోడీ

**సీబీఐ వల్లే భారత్‌కు రావట్లేదు : నీరవ్**

సంచలనం సృష్టించిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ప్రస్తుతం విదేశాల్లో ఉన్న విషయం తెలిసిందే.ఆయనను భారత్‌కు రప్పించేందుకు సీబీఐ విశ్వప్రయత్నాలు చేస్తోంది. అయితే తాను తిరిగి రాలేనని చెబుతూ వస్తున్న నీరవ్ తాజాగా మరో సారి అదే సమాధానమిచ్చారు. అయితే ఈ సారి మాత్రం సీబీఐ వల్లే తాను భారత్‌కు రాలేకపొతున్నానని ఆరో పించారు. ఈ మేరకు సీబీఐ పంపిన మూడో డిజిటల్ సమన్లకు ఆయన మెయిల్ ద్వారా సమాధానమిచ్చారు. 'లోయర్ పరేల్‌లోని నా ఆఫీస్ సర్వర్లను సీబీఐ స్వాధీనం చేసుకుంది. ఇలాంటి సమయంలో నేను భారత్‌కు వస్తే.. చట్ట ప్రకారం నన్ను నేను కాపాడుకునేందుకు నా ప్రాథమిక హక్కులను నేను పూర్తిగా వినియోగించుకోలేను. విచారణాధికారులకు సరైన సమాచారం అందించలేక నేను 'దివ్యాంగుడి'గా మారిపోతాను' అని నీరవ్ తన మెయిల్‌లో పేర్కొన్నారు. సీబీఐ వల్లే తాను భారత్‌కు రాలేకపోతున్నానని చెప్పుకొచ్చారు. తాను భారత్‌కు తిరిగి రానని నీరవ్ గతంలోనూ చెప్పిన విషయం తెలిసిందే. విదేశాల్లో తనకు వ్యాపారాలున్నాయని.. సీబీఐ విచారణకు సహకరించలేనని ఓ సారి చెప్పారు. భారత్‌కు వస్తే తన వ్యక్తిగత భద్రతకు ముప్పు ఉందని, దీనిపై సీబీఐ ఎలాంటి సమాధానం ఇవ్వట్లేదని మరోసారి ఆరోపణలు చేశారు. మరోవైపు నీరవ్ ఆరోపణలను సీబీఐ అధికారులు తోసిపుచ్చారు. నీరవ్ మోదీ ఇస్తున్న సమాధానాలన్నీ కేవలం భారత్‌కు రాకుండే ఉండేందుకు చెబుతున్న సాకులు మాత్రమేనని అంటున్నారు.



**భద్రతా కారణాల దృష్ట్యా రాలేను : ఛోక్సీ**

**ఢిల్లీ :** పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.13 వేల కోట్ల కుంభకోణంలో నిందితుడిగా ఉన్న గీతాంజలి గ్రూప్ యజమాని మెహుల్ ఛోక్సీ విచారణ నిమిత్తం భారత్‌కు వచ్చేందుకు మరోసారి నిరాకరించారు. తాజాగా సీబీఐ ఆయనను విచారణకు హాజరుకావాల్సిందిగా సమన్లు జారీ చేసింది. దీనిపై స్పందించిన ఆయన సీబీఐకి మరోసారి లేఖ రాశారు. 'భద్రతా కారణాల దృష్ట్యా సీబీఐ విచారణకు నేను భారత్‌కు తిరిగి రాలేను. నా పాస్‌పోర్ట్ రద్దు చేశారు. కేసు మూలంగా భారత్‌లో నా వ్యాపారాలను మూసివేయడం వల్ల చాలా సమస్యలు ఎదుర్కొంటున్నాను. వీటికి తోడు విదేశాల్లోని వ్యాపారాలను చూసుకోవడానికి, ప్రస్తుతం ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడానికి చాలా కష్టపడుతున్నాను. దీంతో పాటు నా ఆరోగ్య కారణాల దృష్ట్యా నేను భారత్‌కు ప్రయాణం చేయలేను. నా మీద వస్తోన్న ఆరోపణలు నన్ను మరింత భయానికి గురి చేస్తున్నాయి. దీని వల్ల నా భద్రత విషయంలో చాలా ఆందోళన పడుతున్నాను' అని ఛోక్సీ సీబీఐకి రాసిన లేఖలో పేర్కొన్నారు. 'విచారణ విషయంలో నాకు తగిన సమాచారం ఇవ్వడం లేదు. నాపై వివిధ ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యలు అసంబద్ధంగా ఉన్నాయి' అని ఛోక్సీ ఆరోపించారు. గతంలో ఛోక్సీ నీరవ్ కూడా ఇదే విధంగా భారత్‌లో జరిగే విచారణకు హాజరుకాలేమని లేఖలు రాశారు. పీఎన్‌బీ కుంభకోణం వెలుగులోకి రాకముందే నీరవ్, ఛోక్సీలు దేశం విడిచి పారిపోయారు. ఇప్పటికే వారికి సంబంధించిన పలు ఆస్తులను సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

## రాజధాని వార్తలు కలం

# సా...గుతున్న రాజకీయాలు


రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలతో ప్రజలు ఆవేదనకు గురవుతున్నారు. రాజకీయ సమీకరణాలపై చర్చలు తెరవెనుక ఒప్పందాలు, రెచ్చగొట్టే ప్రెస్‌మీట్లు, టీవీల్లో మాటల తూటాలు వివిధ పార్టీనేతల ప్రసంగాలతో ప్రజలు పరితాపం చెందుతున్నారు. ఎన్నికలు దగ్గరవుతున్న కొద్దీ గెలుపే లక్ష్యంగా ఓటర్లను ప్రభావితం చేసేందుకు వివిధ పార్టీలు చేసే ప్రయత్నాలు యధేచ్ఛగా సాగుతున్నాయికాని, సామాన్యుడి మనోభావాలను మాత్రం ఏ రాజకీయనాయకుడు పట్టించుకోవడం లేదు. రాష్ట్ర ప్రజలకు ఆనాటి పాలక, ప్రతిపక్షం పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీల నెరవేర్చడంలో బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో వ్యవహరించడం, ఆంధ్ర ఎంపీలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఇంతవరకు చర్చకు రాకపోవడం ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మూకుమ్మడిగా కేంద్రం పై విరుచుకు పడాల్సిన సమయంలో ఎవరికి వారే అవిశ్వాస తీర్మానాలు ప్రకటించడం ఆశ్చర్యమే. ఏదో ఒకటి గుడ్డికంటే మెల్ల నయం అని అనుకున్నా ఫలితం లేకుండా ప్రతిరోజు ఉభయ సభలు వాయిదా పడటం విచారకరం. ఇందుకోసం వైసీపీ, తెలుగుదేశం పార్టీలు దేశంలోని మిగతా పార్టీల మద్దతు కూడగట్టాల్సి ఉన్నా.. ఆపని చేయడానికి ఎందుకు ముందుకు రావడంలేదో తెలియడం లేదు. కోట్లు ఖర్చుచేసి సభలు నిర్వహిస్తే దేశవ్యాప్తంగా ఎంపీలంతా చర్చలకు బదులు అల్లర్లు, ఆందోళనలతో సభను అడ్డుకోవడం దేశవాసుల మనస్సును కలచి వేస్తోంది. మరీ ముఖ్యంగా మరో తెలుగురాష్ట్రమైన తెలంగాణను కూడా మన సభ్యులు అనుకూలంగా మార్చుకోలేకపోతున్నారు. మొదటి రోజు టీఆర్ఎస్ ఎంపీ, కేసీఆర్ కుమార్తె కవిత స్వచ్ఛందంగా ఏపీ ప్రత్యేక హోదాకు మద్దతు తెలిపినప్పటికీ ఆమెను ఒప్పించి రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో మన నాయకులు అలసత్వం ప్రదర్శిస్తున్నారన్నది నిజం. మన అవిశ్వాస బిల్లును అడ్డుకునే మరో రాష్ట్రం తమిళనాడు. కావేరీజలాల కోసం సభను నిరంతరం వారు అడ్డుకుంటున్నారు. ఈరెండు రాష్ట్రాల ఎంపీల తీరుపై తెలుగుదేశం పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తుండగా, కాదు టీడీపీ ఎంపీలే సభను పక్కదోవ పట్టిస్తున్నారంటూ టౌమ్స్‌నౌ ఒక పూటంతా కార్యక్రమాలను ప్రసారం చేసింది. దీనిపై టీడీపీ ఇంతవరకు ఎలాంటి ఖండనలూ ఇవ్వలేదు. ప్రత్యేక హోదా పట్ల ప్రజల్లో బలమైన ఆకాంక్ష ఉందని తెలిసిన రాజకీయ నాయకులు తమకు పుట్టగతులుండవని హోదాను భుజాలకెత్తుకున్న మాట వాస్తవం. రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్‌పై ఎంత ఏవగింపు కలిగిందో, ప్రస్తుతం బీజేపీపై కూడా అంతే ఏహ్య భావాన్ని ప్రజలు కనబరుస్తున్నారు. నాలుగేళ్లపాటు ఒక్క ఉద్యోగం, కేంద్ర విద్యాసంస్థల నిర్మాణాలు లేకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏపీని ముప్పతిప్పలు పెడుతోంది. దక్షిణాది రాష్ట్రాలు అందునా ఏపీపై కేంద్రం కక్ష్యపూరితంగా వ్యవహరిస్తోందన్నది కాదనలేని సత్యం. ఈ సమయంలో దక్షిణాది రాష్ట్రాలైన బీజేపీయేతర కేరళ, కర్ణాటక రాష్ట్రాల మద్దతు కూడగట్టి, మమత బెనర్జీ, ఢిల్లీ ఆప్ ప్రభుత్వం, పంజాబ్ లోని కాంగ్రెస్ ఇతర వామపక్షాల మద్దతు కూడగట్టి సభలో గందరగోళానికి తలెత్తే పరిస్థితులను నిరోధిస్తే సభను నిర్వహించడం ఏమంత కష్టంకాదు. లోక్‌సభ స్పీకర్ ఇంతకు ముందే దీనిపై చర్చ చేపడతామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పటికైనా తెలంగాణ ఎంపీలను దారికితెచ్చుకొని దక్షిణాది రాష్ట్రాలను కలుపుకొని ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం కలిగేలా లోక్‌సభలో నిర్మాణాత్మక నిర్ణయాలు తీసుకునే విధంగా ఏపీ ఎంపీలు తమ శక్తియుక్తులను ప్రదర్శించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# ఎస్‌బీఐ ఏటీఎం ధ్వంసం




**గోరంట్ల :** పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఏటీఎంను గురువారం రాత్రి గుర్తు తెలియని ఓ దుండగుడు ధ్వంసం చేసి చోరీకి యత్నంచాడు. ఇది విఫలం కావడంతో పక్కనే ఉన్న కృష్ణారెడ్డి కిరాణా షాపు తాళం పగులగొట్టి రూ. 14 వేల నగదు దొచుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. శుక్రవారం ఉదయం ఎస్ఐ సుధాకర్‌యాదవ్ తన సిబ్బంది వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఎస్‌బీఐ బ్యాంకులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా ఫుటేజ్‌ను నిశితంగా పరిశీలించారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా కేసు విచారణ చేస్తామని ఎస్ఐ తెలిపారు.

# అమిత్ షా టార్గెట్!



**న్యూఢిల్లీ :** 2019 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా భారీ ప్లాన్ వేశారు. ఈశాన్య రాష్ట్రాల నుంచి 25 పార్లమెంట్ స్థానాలు కైవసం చేసుకోవాలని టార్గెట్ పెట్టుకున్నారు. ఇదే విషయమై.. శనివారం పార్టీ బూత్ స్థాయి ఇన్‌ఛార్జ్‌లతో జరిగిన సమావేశంలో నేతలకు టార్గెట్ నిర్దేశించారు. 25 సీట్ల టార్గెట్‌లో కనీసం 21 సీట్లైనా గెలుపొందాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పార్టీ గెలుపుకోసం విశేషంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాగా, గత సార్వత్రిక ఎన్నికల్లో(2104) ఈశాన్య రాష్ట్రాల నుంచి బీజేపీ కేవలం 7 స్థానాల్లో మాత్రమే గెలుపొందింది.




# నగరంలో కొంత భాగమే 'స్మార్ట్ సిటీ'

- విశాఖ, కాకినాడ, తిరుపతి పనుల అప్పగింత
- డీపీఆర్ తయారీలో రాజధాని అమరావతి
- ప్రశ్నోత్తరాల్లో మంత్రి నారాయణ



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** కేంద్రం ఎంపిక చేసిన స్మార్ట్ సిటీల్లో విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి పనులు ఆయా సంస్థలకు అప్పగించినట్లు పట్టణాభివృద్ధి, మున్సిపల్‌శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతికి సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పన జరుగుతోందన్నారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో రాష్ట్రంలో స్మార్ట్ సిటీ పనులపై ఎమ్మెల్యే వి. గణేష్‌కుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. ఏ నగరాలనైతే స్మార్ట్ సిటీలుగా ఎంపిక చేశారో వాటిని పూర్తిగా కాకుండా నిర్దేశించిన ప్రాంతాన్ని మాత్రమే స్మార్ట్ సిటీలుగా నిర్మిస్తామన్నారు.ఈ పథకంలో కేంద్రం నుంచి ఒక్కో నగరానికి రూ.500 కోట్ల సాయం అందుతుందన్నారు. మిగిలిన మొత్తాన్ని రాష్ట్రమే భరిస్తుందన్నారు. విశాఖపట్నంలో 47 ప్రాజెక్టులకు గాను రూ.1471 కోట్లు, కాకినాడలో 68 ప్రాజెక్టులకు రూ.1940 కోట్లు, తిరుపతిలో 42 ప్రాజెక్టులకు రూ.1610 కోట్లు వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించడం జరిగిందన్నారు. ఐదేళ్ల కాల వ్యవధిలో స్మార్ సిటీలను పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. కాగా విశాఖపట్నం ఉత్తర నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులపై ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు లేవనెత్తిన ప్రశ్నకు సమాధానమిస్తూ టెండర్లను పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. దీంతో ఆయా నిబంధనల్లో మార్పులు చేసినట్లు చెప్పారు. ముఖ్యంగా కొండవాలు ప్రాంతాల్లో రహదారులు, కమ్యూనిటీ హాళ్లు వంటి నిర్మాణాలకు గతంలో ఉన్న టీడ్ అండ్ లిఫ్ట్ విధానంలో 3 మీటర్ల నుంచి 50 మీటర్ల వరకూ నిబంధనను 3 మీటర్ల నుంచి 150 మీటర్లుగా మార్పు చేశామన్నారు. మిగిలిన 13 పనులకు రూ.1.88 కోట్ల అంచనా వ్యయంతో మూడోసారి టెండర్లు పిలిచినట్లు మంత్రి వివరించారు.

## లూర్ధు మాత దేవాలయంలో సిలువ ధ్యానం



**రాజధాని ప్రతినిధి, రాయపూడి :** రాయపూడి లూర్ధు దేవాలయంలో తపస్సు కాలంలో 5వ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఏసు ప్రభు సిలువ మీద పలికిన 7 మాటలను ధ్యానించారు. విచారణ గురువులు ఫాదర్ ఇన్నారెడ్డి, రెవ. ఫాదర్ బొక్కా రమేష్ రెవ. ఫాదర్ శెవిరెడ్డి, మఠకన్యలు, ఉపదేశి, కె.ప్రసాదరావు, సంఘపెద్దలు నండూరి.విజయకుమార్ వి. రవి, చిలకా. చంద్రరావు, ఇసుకవల్లి చంటి, కంబ చిలక చంద్రరావు, నండూరి విజయకుమార్ పాల్గొన్నారు.


## ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



**రాజధాని ప్రతినిధి, తుళ్ళూరు :** రాయపూడిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భగత్ సింగ్ 87 వర్ధింతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ యువజన నాయకులు జి.వి రాజు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిన్నవయస్సులో ప్రాణత్యాగం చేసిన భగత్ సింగ్ భారతీయులకు చిరస్మరణీయుడని ఆయన కొనియాడారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు, టి రత్నరాజు, శ్రీ కాంత్ కెమీరా, టి.నాగరాజు. ప్రభుదాస్, స్టాలిన్.. సీపీఐ నాయకులు చింతరాల కోటేశ్వరరావు, కంభంపాటి దేవునిదయ పాల్గొన్నారు.

# సులభతర వాణిజ్యంలో ఏపీ నంబరు వన్

- ముఖ్యమంత్రి చంద్రబాబు
- హీరో మోటార్స్ పరిశ్రమకు భూమి పూజ
- 600 ఎకరాల్లో రూ. 1600 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు



**వరదయ్యపాళెం :** చిత్తూరు జిల్లా శ్రీసిటీ సమీపంలో మాదనపాలెం వద్ద 600 ఎకరాల్లో రూ. 1600 కోట్ల పెట్టుబడితో నూతనంగా నిర్మించనున్న హీరో మోటార్స్ పరిశ్రమకు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి హీరో మోటార్స్ సీఎండీ పవన్ మంజుల్ పుష్ప గుచ్ఛం అందజేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథులుగా పరిశ్రమల శాఖ మంత్రి ఎన్. అమరనాథ్ రెడ్డి, కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న, శ్రీ సిటీ ఎండీ సన్న రెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే తలారి ఆదిత్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి మాట్లాడుతూ మొదటిసారిగా దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లా శ్రీసిటీ సమీపంలో మాదనపాలెంలో హీరో మోటార్స్ పరిశ్రమకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషమని, ఈ రోజు చరిత్రాత్మక రోజు అని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో అత్యధిక ద్విచక్ర వాహనాల తయారీ కంపెనీ హీరో మోటార్స్ ఏపీకి రావడం హ్యాపీ, మోటార్స్ కుటుంబంతోనాకు ముందు నుంచి మంచి సంబంధాలు ఉండడం వల్ల హీరో మోటర్స్ సీఎండీ వపన్ ముంజల్‌కు ఒప్పించి కంపెనీ 8 వ తయారీ యూనిట్‌ను ఏపీకి తీసుకువచ్చామన్నారు. లాజిస్టిక్స్‌లో. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ నెంబర్ వన్ అని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఏపీ చాలా అనుకూలమన్నారు. కృష్ణపట్నం పోర్ట్, చెన్నై ఎయిర్‌పోర్టు, శ్రీసిటీ హీరో మోటార్స్‌కు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు. వచ్చే ఏడాది మార్చిలోపు హీరో మోటార్స్ మొదటి దశ వాహనాల ఉత్పత్తి తయారు కావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమల శాఖ, కలెక్టర్ నుండి సంపూర్ణ సహకారం అందిస్తామని పవన్ మంజల్‌కు హామీ ఇచ్చారు. హీరో మోటార్స్ టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని ఎలక్ట్రికల్ బైక్స్‌ను తయారు చేయాలని కోరారు. రాష్ట్రంలో 3 సార్లు కోట్ల విలువ చేసే ఎంఓయూలు కుదుర్చుకున్నట్లు సీఎం వివరించారు. ఇవన్నీ వస్తే దాదాపు 40 లక్షల మందికి ఉదోయగాలు రావచ్చని చెప్పారు. రానున్న రోజుల్లో కృష్ణపట్నం నుండి కియా మోటార్స్ వరకు చిత్తూరు మీదుగా 4లేన్ల జాతీయ రహదారి ఏర్పాటు చేస్తామన్నారు. పరిశ్రమలకు నీరు, విద్యుత్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటమని చెప్పారు.

కార్యక్రమంలో ముఖ్యమంత్రి కూడా వపన్ మంజల్‌ను సన్మానించారు. అనంతరం సీఎం రేణగుంట ఎయిర్ పోర్ట్‌కు హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో వరదయ్యపాళెం తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు చలపతి నాయుడు, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శివపన్ కుమార్, మండల యూత్ అధ్యక్షుడు మహేష్ బాబు, పార్టీ నాయకులు కరుణాకర్ నాయుడు, నిర్మల్, నవాబ్ వేణు, దసరదన్, అయ్యప్ప రెడ్డి. సత్యవేడు నాయకులు ఎంపీపీ మస్తాన్, సుందర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## FORM IV

**Statement about ownership and other particulars about newspaper RAJADHANI VARTALU**

| | |
|---|---|
| 1.Place of publication : | Rayapudi, Guntur District, Andhra Pradesh |
| 2.Periodicity of its publication : | Weekly |
| 3.Printer's Name : | Pattan Hussain Khan |
| Nationality : | Indian |
| Address : | 6-45/1, Rayapudi Post, Guntur District, AP - 522237 |
| 4.Publisher's Name : | Pattan Hussain Khan |
| Nationality : Indian | |
| Address : | 6-45/1, Rayapudi Post, Guntur District, AP - 522237 |
| 5.Editor's Name : | Pattan Hussain Khan |
| Nationality : | Indian |
| Address : | 6-45/1, Rayapudi Post, Guntur District, AP - 522237 |
| 6.Names and addresses of Individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital : | Vastitude Media Pvt.Ltd |

I, Pattan Hussain Khan, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief

Sd/ -
Pattan Hussain Khan
Date : 24-3-2018

Signature of Publisher

## పసిడి రాకుమారి మను బాకర్




**సిడ్నీ :** మను బాకర్.. ఈ పేరు ఎక్కడో విన్నట్టు ఉందే అని అనుకుంటున్నారా. ఔను. నిజమే. ఐఎస్ఎస్ఎఫ్ సీనియర్ షూటింగ్ ప్రపంచకప్‌లో రెండు స్వర్ణ పతకాలతో సంచలనాలు సృష్టించిన ఈ 16 ఏళ్ల చిన్నది ఇప్పుడు జూనియర్ ప్రపంచకప్‌లోనూ తన సత్తా చాటుతోంది.

ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ ప్రపంచకప్ పోటీలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 10మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో మను స్వర్ణం సొంతం చేసుకుంది. అలాగే 10మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో మను జట్టు స్వర్ణం సొంతం చేసుకుంది. వ్యక్తిగత విభాగంలో 235.9 పాయింట్లతో మను స్వర్ణం గెలుచుకోగా.. థాయ్‌లాండ్(234.9), చైనా(214.2) క్రీడాకారిణీలు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచారు. మరో భారత క్రీడాకారిణి దేవాన్షి రాణా 195.3 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.

మను బాకర్, దేవాన్షి రాణా, మహిమా అగర్వాల్ కలిసి 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం కైవసం చేసుకున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, థాయ్‌లాండ్ నిలిచింది.

## చలో విజయవాడ గోడపత్రిక ఆవిష్కరణ



**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) చలో విజయవాడ గోడపత్రికను జిల్లా పరిషత్ చైర్పర్సన్ గద్దె అనురాధ, డెప్యూటీ సీఇఓ క అప్షమోహన్ ఆవిష్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న యూనియన్ ప్రతినిధులను చైర్పర్సన్ అనురాధ అభినందించారు. ఈ నెల 26వ తేదీన విజయవాడలో తలపెట్టిన వార్షికోత్సవం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు ఎంవి.ఆంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శులు కొడాలి శ్రీను, వీరపనేని నాగేశ్వరరావు, ఠాగూర్ తదితరులు పాల్గన్నారు.

# కెమెరా 'ఉమెన్' జయశ్రీ

ఆమె





**మగవాళ్లకే సొంతమనే వృత్తుల్లోకి మహిళలు ప్రవేశించి తమ సత్తా నిరూపించుకుంటూ అన్నింటా విజయకేతనం ఎగుర వేస్తున్నారు.**

ఫొటోలు,షూటింగ్‌లు అంటేనే కెమెరా మెన్‌లదే అనుకుంటున్న ఈ రంగంలోకి ఎనభయ్యవ దశకంలోనే ప్రవేశించి తన అసమాన ప్రతిభాపాటవాలతో ముందుకు పోయిన మహిళ కేరళకు చెందిన జయశ్రీ.

ప్రధానమంత్రి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను కవర్ చేయడానికి ఎర్రకోట బురుజు దగ్గర కెమెరా యాంగిల్ సెట్ చేసుకుంటూ, అంతకు సుమారు 7 నెలల ముందు రాష్ట్రపతి భవన్ ఎదుట, రాజ్‌పథ్‌లో రిపబ్లిక్ డే పెరేడ్ షూట్ చేస్తూ ఓ 55 ఏళ్ల మహిళ కనిపించింది.

ఇంకా వెనక్కి అంటే ఓ పద్నాలుగేళ్ల వెనక్కి వెళ్తే అది 2004, హిందూ మహాసముద్రంలో సునామీతో కకావికలమైన జనజీవనాన్ని కూడా షూట్ చేసిందామె. వీటికి మధ్యలో అబ్దుల్ కలామ్, ప్రతిభాపాటిల్, ప్రధానుల విషయానికి వస్తే అటల్ బిహారీ వాజ్‌పేయి నుంచి నేటి నరేంద్రమోడీ వరకు ఆమె కెమెరాలో షూట్ అయిన వాళ్లే.

ప్రస్తుతం ఈ తరం అమ్మాయిలు అబ్బాయిల కంటే వేగంగా దూసుకుపోతున్నారు. కానీ, రిటైర్మెంట్‌కి దగ్గరవుతున్న ఈ మహిళ వీడియో షూటింగ్ చేస్తోందంటే కొత్త వారికి ఆశ్చర్యంగా ఉండడం సహజమే. అయితే ఆమెకు ఇది 32 ఏళ్లుగా డైలీ రొటీన్. ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్ అయిన ఈ మలయాళీ అమ్మాయి జీవితాన్ని 1984 నాటి ఓ పత్రికా ప్రకటన పూర్తిగా మలుపు తిప్పేసింది.

**ట్రైనింగ్ ఇస్తాం ఉద్యోగమూ ఇస్తాం!**

దూరదర్శన్ జాతీయ స్థాయి లోనూ, అన్ని రాష్ట్రాల్లో ప్రసారాలు మొదలు పెట్టడానికి సన్నాహాలు మొదలవుతున్న రోజులవి. కెమెరామెన్ కోసం ఒక ప్రకటన వెలువడింది. ట్రైనింగ్ ఇచ్చి, ఉద్యోగంలో చేర్చుకుంటారనేది విషయం. ఆ ప్రకటన చూసిన జయశ్రీలో ఒక ఆలోచన వచ్చింది. కెమెరామెన్ అట. కెమెరా ఉమెన్ ఎందుకు కాకూడదు. ఆలోచన వచ్చిందే తడవుగా ఇంటర్వ్యూకి వెళ్లింది. అమ్మాయి వచ్చిందేమిటి అనుకుంటూనే ప్రశ్నలు మొదలు పెట్టారు.

ఇంతకు ముందు కెమెరా అనుభవం ఉందా అని అడిగారు. ఏ మాత్రం లేదనే ఆన్సర్‌తో మళ్లీ ఆశ్చర్య పోయారు. మరెందుకొచ్చావు అని మరో ప్రశ్న. నేర్చుకోవాలనే కోరిక బలంగా ఉంది, మీరు నేర్పిస్తే చక్కగా నేర్చుకుంటాను, అంతకంటే సిన్సియర్‌గా ఉద్యోగం చేస్తాను ఇదీ ఆమె సమాధానం. ఉద్యోగం వచ్చింది. జయశ్రీ తొలి వీడియో జర్నలిస్టు అవునా కాదా అనే మీమాంస పక్కన పెడితే తొలి తరం వీడియో జర్నలిస్టు అని చెప్పవచ్చు. ఇప్పటిలాగా లెక్కకు మించిన చానెళ్లు ఉన్న రోజులు కావవి. ఉన్న ఒక్క దూర దర్శన్‌తోనే ఆమె మగవాళ్ల గ్లాస్ సీలింగ్‌ను బ్రేక్ చేసింది.

అయితే మగవాళ్లతో విభేదాల్లేవు, విరోధాల్లేవు. స్నేహ పూర్వక వాతావరణంలోనే ఉద్యోగం చేశానంటోంది జయశ్రీ. మనవంతుగా ఉద్యోగానికి మన హండ్రెడ్ పర్సెంట్ సర్వీస్ ఇస్తూ పోతే మహిళ అయిన కారణంగా ఎదురయ్యే వివక్షలను ఈజీగా ఎదుర్కోవచ్చు అంటారామె. సమర్థత, సిన్సియారిటీలే విజయ శిఖరాల మీద నిలబెడతాయని చెబుతోంది జయశ్రీ.

## కాలమ్

### నా కోరిక స్మార్ట్ ఫోన్ అవ్వాలని..

రాత్రి భోజనాల తర్వాత ఒక టీచర్ ఆమె విద్యార్థులు రాసిన వ్యాసరచన పేపర్లను దిద్దడం ప్రారంభించింది. ఆమె పిల్లలు పడుకున్నారు!

భర్త కుర్చీలో కూర్చొని తన స్మార్ట్ ఫోన్లో 'క్యాండీ క్రష్'లో లీనమైయున్నాడు.

చివరి పేపర్ దిద్దాడానికి తీసి చదివిన ఆ టీచర్ నిశ్శబ్దంగా ఏడుస్తూ ఉంది.

ఆ ఏడుపు, వెక్కిళ్ళ శబ్దానికి భర్త తలతిప్పి చూసి ఆశ్చర్యపోయాడు!

"ఏమైంది? ఎందుకు ఏడుస్తున్నావు? ఏం జరిగింది?" అడిగాడతను టెన్షన్తో.

"నిన్న నా సెకండ్ క్లాస్ విద్యార్థులకు హోంవర్క్ ఇచ్చాను. " మీరు ఏం కావాలనుకుంటున్నారు" అనే అంశంపై ఏదైనా రాసుకుని రమ్మని.

"అయితే ...?" "ఇదిగో? ఈ చివరి పేపర్ దిద్దుదామని చదువుతుంటే ఏడుపును ఆపుకోవడం నా తరం కావడంలేదు!!

భర్త ఆసక్తిగా.... "అంత ఏడిపించే విధంగా ఏం రాశాడు?"

హెడ్డింగ్ ఇలా పెట్టాడు

"నేను స్మార్ట్ ఫోన్ అవ్వాలని నా కోరిక."

అమ్మానాన్నలు స్మార్ట్ ఫోన్లు చాలా ప్రేమిస్తారు!

వాళ్ళు స్మార్ట్ ఫోనును చాలా కేర్‌గా... శ్రద్ధగా.. ఇష్టంగా చూసుకుంటారు. నాకన్నా ఎక్కువగా...!!

నాన్న ఆఫీసు నుండి అలసటతో వచ్చినప్పుడు, అతనికి స్మార్ట్ ఫోన్ రిలాక్స్ ను ఇస్తుంది. నాన్నకి స్మార్ట్ ఫోన్ కోసం సమయముంది. కానీ, నా కోసం లేదు! ఎందుకంటే నాతో ఆడుకోవడం మా నాన్నకు రిలాక్స్ ను ఇవ్వడంలేదు!

అమ్మానాన్నలు ముఖ్యమైన పనుల్లో ఉన్నప్పుడు కూడా స్మార్ట్ ఫోన్ రింగౌతుంటే... ఒకటి రెండు రింగులు వచ్చేలోపే వాళ్ళు.. ఫోన్ చేతిలోకి తీసుకుని జవాబిస్తారు! కానీ ... నేను ఎన్నిసార్లు పిలిచినా దానికిచ్చే ప్రిఫరెన్స్ నాకివ్వరు!!.. నేను ఏడూస్తూ వుంటే కూడా వాళ్ళు నాతో కాకుండా స్మార్ట్ ఫోన్లతో గడుపుతుంటారు! వాళ్ళు నాతోకన్నా స్మార్ట్ ఫోన్లతో ఆడుకోవడానికే ఎక్కువ ఇష్టపడుతారు?

వాళ్ళు తమ స్మార్ట్ ఫోన్లో మాట్లాడుతున్నప్పుడు నేనేం చెప్పినా వినిపించుకోరు!

అది నాకు ముఖ్యమైన విషయమైనా సరే!

అదే ఒక వేళ నాతో మాట్లాడుతున్నప్పుడు రింగ్ వస్తే మాత్రం వెంటనే ఫోన్‌కి జవాబిస్తారు!

అమ్మానాన్నలు స్మార్ట్ ఫోన్‌న్ని కేర్‌గా చూసుకుంటారు!

ఎప్పుడూ తనతోనే ఉంచుకుంటారు!

దానికి చాలా ప్రాధాన్యతనిస్తారు!

దాన్ని చాలా ఇష్టపడుతారు!!

దానితో రిలాక్స్ అవుతుంటారు!!

దానికి తమ ఖాళీ సమయాన్ని కేటాయిస్తారు.!!

పడున్నప్పుడు కూడా ప్రక్కనే ఉంచుకుంటారు!!

ఉదయం లేవగానే దాన్నే చేతిలోకి తీసుకుంటారు!!

కాబట్టి! నా కోరిక ఏమిటంటే... నేను అమ్మానాన్న చేతిలో ఉంటే స్మార్ట్ ఫోన్ కావాలనుకుంటున్నాను!!

భార్య చదువుతుంటే... విన్న భర్తకు మనసంతా పిండేసినట్లైంది!! అతని కళ్ళలో కూడా కొంచెం తడి వస్తుండగా.... "ఎవరు రాశారది? "అడిగాడు భార్యని.

"మన కొడుకు" అంది భార్య కన్నీరు కారుతుండగా!

వస్తువులను ఉపయోగించుకోవాలి! బంధాలను ప్రేమించాలి!!

అన్ని బంధాలకన్నా ఎక్కువగా వస్తువులపై బంధాన్ని ఏర్పరచుకుని ప్రేమించడం మొదలుపెడుతూవుంటే... క్రమంగా అసలైన బంధాలు వెనక్కి నెట్టివేయబడతాయి!





# రాజధాని క్లాసిఫైడ్స్

## నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :9440662699

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్: 9440662699

## ఇతరములు

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

**పి.యల్.సి.బి డెవలపర్స్**
అమరావతి రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలములు కావలసిన వారు సంప్రదించండి
ఫోన్ : 9440662699

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**రాయపూడి**
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

**రాయపూడి**
రియల్‌ఎస్టేట్ క్రయ,విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : 9848442436

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

## షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్ట్రైలర్స్
ఫోన్ : 9492470426

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

## హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

**విజయవాడ**
ఇంధిరారావు మెడికేర్ (సెంటర్)
ఫోన్ : 9440421580

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి డా॥ రెహమాన్
ఫోన్ : 0866-2475087

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్ డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

**విశాఖపట్నం**
చింతలూరు ఆయుర్వేద డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

## వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333


నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.
- మేనేజర్

ప్రకటనలకు సంప్రదించండి 9440662699


ప్రపంచ జల సంక్షోభం, సహజసిద్ధ పరిష్కారానికి

# భారత్ కసరత్తుకు ఐరాస ప్రశంస



**న్యూఢిల్లీ :** ప్రపంచంలో జలసంక్షోభం ముప్పు పించివున్నప నేపథ్యంలో దాన్ని అధిగమించేందుకు సహజసిద్ధ పరిష్కారాలను కనుగొనేందుకు భారత్ చేస్తున్న కృషిని ఐక్యరాజ్య సమితి (ఐరాస) ప్రశంసించింది. 2050 నాటికి ఐదు డిల్లియన్ల మంది నీటి ఎద్దడిని ఎదుర్కోనున్న నేపథ్యంలో భారత్‌లోని స్థానిక సంస్థలు ఇందుకు సహజసిద్ధమైన పరిష్కారాలను కనుగొనేందుకు తీవ్రస్థాయిలో కసరత్తు చేయాడాన్ని ఐరాస ప్రపంచ జల అభివృద్ధి నివేధిక 2018 నివేధికలో అభినందించింది. బ్రెజిల్ జరిగిన ప్రపంచంలోనే అతి పెద్ద జల కార్యక్రమంలో చైనా వారి వర్షపు నీటి రీసైక్లింగ్, భారతదేశ ఫారెస్ట్ రీజెనరేషన్, ఉక్రెయిన్ ఆర్టిఫీషియల్ వెట్‌ల్యాండ్స్ వంటి సహజసిద్ధ పరిష్కారాలను ఐరాస పరిశీలించింది. పెరుగుతున్న జనాభా, వాతావరణంలో మార్పుల కారణంగా జలభద్రత సవాళ్లను ఎదుర్కొనేందుకు జలవనరులను సమర్థవంతంగా నిర్వహిచండం కీలకమని, ఇందుకోసం కొత్త పరిష్కారాలు కూడా అంతే ముఖ్యమని నివేదిక ముందుమాటలో యూఎన్ ఎడ్యుకేషన్, సైటింఫిక్, కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) హెడ్ ఆడ్రేఅజౌలే పేర్కొన్నారు. ఏమీ చేయకుండా ఉన్నట్లయితే 2050 నాటికి ఐదు బిలియన్ల మంది పేదలకు నీటికటకట తప్పదని హెచ్చరించారు. భారత్‌లో పలుచోట్ల ప్రయోగాత్మకంగా చేపట్టిన పలు కార్యాక్రమాలు సత్ఫలితాలు ఇచ్చినట్టు నివేదిక పేర్కొంది. వినూత్నమైన జల పరిష్కారాలు గ్రామీణ భారత్‌లో నీటి భద్రతను మెరుగు పరిచిందని తెలిపింది. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులు వల్ల తడి నేతలు మరింత తడిగా, పొడి నేలలు మరింత పొడిగా మారుతున్నాయని వివరించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సగం జనాభా అంటే దాదాపు 3.6 బిలియన్ల మంది నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని పేర్కొంది. 2050 నాటికి ప్రపంచ జనాభా మరింత పెరగనున్న నేథ్యంలో నీటి కష్టాలు తీవ్రతరమౌతాయని వెల్లడించింది. ఇరిగేషన్ కెనాల్స్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్స్ వంటివి మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం కావని పేర్కొంది 70 శాతం వర్షపు నీటిని రీసైకిల్ చేసే చైనా స్పాంజ్ సిటీ ప్రాజెక్టును ఉదాహరణగా చూపింది. పెరుగుతున్నా నీటి డిమాండును అధిగమిం చేందుకు చైనా ఇటీవల ప్రాజెక్టు స్పాంజ్ సిటీని చేపట్టిందని, తద్వారా పట్టణాల్లో పరిస్థిల్లో పరిస్థితి మెరుగుపడిందని, 70 శాతం వర్షపు నీరు రీసైకిల్ అవుతోందని నివేదిక వెల్లడించింది.

# ఉక్కు ఫ్యాక్టరీకి కడప అనుకూలమే

- కేంద్రం వద్ద సాధ్యాసాధ్యాల నివేదిక
- ప్రశ్నోత్తరాల కార్యక్రమంతో మంత్రి సుజయ కృష్ణ రంగారావు



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** కడపలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి అన్ని విధాలుగా అనుకూల వాతావరణ పరిస్థితులు నెలకొని ఉన్నాయని గనులు, భూగర్భశాఖ మంత్రి వెంకట సుజయ కృష్ణ రంగారావు తెలిపారు. ఏపీ పునర్విభజన చట్టం- 2014లో కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. దీనిపై గతంలో స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐఎల్) రూపొందించిన నివేదిక సాధ్యం కాదని ఇచ్చిందన్నారు. అయితే రాష్ట్ర విజ్ఞప్తిని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థగా ఉన్న మెకాన్ సంస్థ అందచేసిన ఆర్థిక పరమైన సాధ్యాసాధ్యతలపై నివేదికలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయవచ్చని పేర్కొన్న విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నట్లు సభాపూర్వకంగా తెలిపారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు ఎం వెంకట మల్లికార్జునరెడ్డి, ఎస్వీ మోహనరెడ్డి కడప ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. అవసరమైతే కేంద్రంపై వత్తిడి తీసుకొచ్చి అయినా ఫ్యాక్టరీని సాధించుకోవాలన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. కడపతోపాటు అనంతపురం, చిత్తూరు, ప్రకాశంజిల్లాల్లో అపారమైన ఖనిజ నిక్షేపాలున్నాయని మెకాన్ సంస్థ గుర్తించిందన్నారు. సాధారణంగా ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలంటే 30 ఏళ్లకు సరిపడినంతగా 3 మిలియన్ టన్నుల ముడిఖనిజ నిక్షేపాలు ఉండాలన్నారు. అయితే ఈ ప్రాంతంలో 4.5 మిలియన్ టన్నుల ఖనిజం ఉందన్నారు. ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసరమయ్యే భూమితోపాటు విద్యుత్' నీరు, రైల్వే అనుసంధానత వంటి అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామని కేంద్రానికి గతంలోనే చెప్పామన్నారు. మెకాన్ సంస్థ అందచేసిన నివేదిక కేంద్రం వద్దే ఉందన్నారు. అయినప్పటికీ ఈ విషయమై కేంద్రం ఏ విధమైన సమాచారం ఇవ్వలేదని సభకు తెలిపారు. గత జనవరిలో టాస్క్‌ఫోర్స్ సమావేశం జరిగిందని, ఈ సారి జరిగే సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు.

**రాష్ట్రంలో 59 జూనియర్ కళాశాలల ఏర్పాటుకు ప్రతిపాదనలు: మంత్రి గంటా శ్రీనివాసరావు**

రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో 59 జూనియర్ కళాశాలల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు అందాయని మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యేలు పి రమేష్‌బాబు, బి జయనాగేశ్వరరెడ్డి, గద్దె రామ్మోహన్, ఎం వెంకటేశ్వరరావు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ.. సాధ్యమైన ప్రాంతాల్లో కళాశాలలను ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న విద్యా సంవత్సరంలోనే ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం 3260 జూనియర్ కళాశాలలున్నాయని తెలపారు. వీటిలో ప్రైవేటు కళాశాలలు 2,193, ప్రభుత్వ కళాశాలలు 450, ఎయిడెడ్ కళాశాలలు 124 ఉన్నాయన్నారు.

# అమెరికా కంటి నలుసు

# 'పుతిన్'



**వ్లాదిమిర్ పుతిన్ మళ్లీ అధ్యక్షుడిగా ఎన్నికవడం అమెరికా మిత్రదేశాలకు మింగుడుపడటం లేదు.వేర్పాటు వాది డొనాల్డ్ ట్రంప్‌ను అమెరికా అధ్యక్షుడిగా నెగ్గించడంలో పుతిన్ పాత్ర ఉందని, అమెరికా వెనుకబడాలనే ఉద్దేశ్యంతోనే కావాలని అతనిని గెలిపించారనే ప్రచారం ప్రపంచవ్యాప్తంగా జరుగుతోంది. ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం మాస్కోనుంచి 24 మంది దౌత్యవేత్తలను రష్యా బహిష్కరించింది. గూడాచారిగా భావించి రష్యాకు చెందిన ఒక వ్యాపారవేత్తను అతని కుమార్తెను బ్రిటన్ ప్రభుత్వం విషప్రయోగంతో హత్యచేసినందుకు పుతిన్ తీసుకున్న నిర్ణయం ఇది. ఇదే సమయంలో పుతిన్ తన అంతరంగిగులతో ఈ హత్య చేయించాడని బ్రిటన్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. అంతేకాదు అంతర్జాతీయంగా పుతిన్‌ను ఏకాకిని చేయాలని బ్రిటన్ ప్రధాని థెరిసామే పిలుపునిచ్చిన నేపథ్యంలో పుతిన్ మళ్లీ రష్యా అధ్యక్షుడిగా ఎన్నికవడం అమెరికా మిత్రదేశాలకు కలవరం కలిగిస్తోంది. సోవియట్ యూనియన్ ఆఫ్ రష్యా పతనం తర్వాత అమెరికా దాని మిత్రపక్షాలు ప్రపంచంలో ఎదురులేని శక్తులుగా నిలిచిన తర్వాత వారికి కంటిలో నలుసుగా తయారయ్యాడు పుతిన్ .. ఆయన గురించి మరిన్ని వివరాలు**

వ్లాదిమిర్ పుతిన్ 1952 అక్టోబరు7న లెనిన్ గ్రాండ్‌లో జన్మించాడు. తల్లి మారియా షెలోమీవియా, తండ్రి లాడ్మిన్ స్పైరిడోనొవిచ్ పుతిన్ ప్రపంచ యుద్ధంలో పాల్గొన్నాడు. సెక్యూరిటీ గార్డుగా పని చేశారు.ఆ యుద్ధాలతో రష్యా తలెత్తిన తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఆ కుటుంబం కూడా ఎదుర్కొంది. దీంతో అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో పుతిన్ పెరగాల్సి వచ్చింది. చిన్నప్పుడు ఆయన అంత మంచి తెలివితేటలు లేకపోయినా తర్వాతి కాలంలో చదువుపై జిజ్ఞాస పెంచుకున్నారు. ఆటల్లో కూడా ఆయన ప్రత్యేక ప్రతిభ కనబరిచేవారు.స్కీయింగ్, బ్యాడ్‌మింటన్, సైక్లింగ్, ఫిషింగ్ ఆయనకు ఎంతో ఇష్టం. కాగా ఫుటబాల్ ఐస్ హాకీని తిలకిస్తారు. మార్షల్ ఆర్ట్స్ జుడో అంటే ఆయనకు ఎంతో ఇష్టం. అయితే ఆయన తల్లికి మాత్రం ఇది సుతారమూ నచ్చేదికాదు. ఒకసారి శిక్షకుడు ఇంటికొచ్చి తల్లిదండ్రులను ఒప్పించాల్సి వచ్చింది. లెనిన్ గ్రాండ్ యూనివర్సిటీలో పుతిన్‌లా చదివాడు.

ఆయనకు నావికుడు, పైలెట్ అవ్వాలని ఉండేది. అయితే అనూహ్యంగా కేజీబీ (రష్యా) నిఘాసంస్థలో అధికారిగా అవకాశం వచ్చింది. ఆయన తూర్పు జర్మనీలో పనిచేశారు. ఒకరోజు ఒక స్నేహితుడు సినిమాలకు టికెట్లు తీసుకున్నానని మన ఇద్దరితోపాటు మరో ఇద్దరు యువతులు కూడా సినిమాకు వస్తారన్నారు. వారిలో ఒకామె ల్యాడ్మిలా అలెకస్సాండ్రోవా కూడా ఉన్నారు. ఆమె ఎయిర్‌లైన్స్ అటెండెంట్‌గా ఉండే వారు. ఆమెతోస్నేహం పరిణయానికి దారితీసింది. 1983 జూలై 28న వారి పెళ్లి



జరిగింది. ఇద్దరు ఆడ పిల్లలు మారియా పుతిన్ ఏకాటిరైనా పుతిన్ .30 ఏళ్ల వైవాహిక బంధం ముగిసి 2013లో వారు విడాకులు తీసుకున్నారు. ఆతర్వాత వారి కుటుంబం మాస్కోకు చేరింది. తూర్పు జర్మనీలో ఆయన అందించిన సేవలకు నేషనల్ పీపుల్స్ ఆర్మీ బిరుదు వచ్చింది.

1996లో మాస్కోలో ఆయన రాజకీయ జీవితం ప్రారంభం అయింది. లెనిన్‌గ్రాండ్ మేయర్‌కు అంతర్జాతీయ వ్యవహారాల సలహాదారుగాఉండేవారు. అదే ఏడాది ఇంటర్నేషనల్ ఎక్స్‌టర్నల్ రిలేషన్స్ కమిటీ అధికారిగా నియమితులయ్యారు. 1997 మార్చి 26న అప్పటి రష్యా అధ్యక్షుడు బోరిస్ ఎల్సిన్ పుతిన్‌ను ఉప ప్రధానిగా నియమించారు. 1998 జూన్ వరకు ఆ పదవిలోనే ఉన్నారు. అదే ఏడాది జూలై 25న పుతిన్ రష్యా నిఘా సంస్థ అయిన ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్(ఎఫ్ఎస్‌బీ)కు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 1999 డిసెంబరు 31న అనూహ్య పరిస్థితుల్లో ఎల్సిన్ రాజీనామా చేయగా పుతిన్ ఆపధర్మ రష్యా అధ్యక్షుడిగా పదవీబాధ్యతలు స్వీకరించారు. 2000 ఎల్సిన్ రాజీనామాతో పుతిన్ అధ్యక్షుడి ఎన్నికల బరిలో నిలిచారు. రష్యా రాజ్యాంగం ఏకధాటిగా అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి అనుమతించని కారణంగా ఆయన ప్రధానిగా 1999 నుండి 2000 వరకు , తిరిగి 2008 నుండి 2012 వరకు రష్యా ప్రధాన మంత్రిగా పనిచేశారు.2012 నుంచి 2018 వరకు అధ్యక్షుడిగా కొనసాగిన ఆయన ఇటీవల జరిగిన ఎన్నికల్లో అంతకుముందుకంటే 11 శాతం ఓట్లతో నాలుగోసారి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఆరేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. మైనస్ 15 డిగ్రీల చలిలో ఆయన ఆయన మాటలకోసం 30 వేల మంది హాజరయ్యారంటే సామాన్య విషయం కాదు. కేవలం రెండు నిముషాలు మాత్రమే మాట్లాడి వారిని వెనక్కుపంపారు.

రష్యాలో జోసఫ్ స్టాలిన్ తర్వాత ఎక్కువ కాలం పదవిలో ఉన్న వ్యక్తిగా పుతిన్ రికార్డు కెక్కారు. పుతిన్ హయాంలో అంతర్గతంగా దేశ పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ రష్యా ప్రతిష్ట కాపాడారన్న భావన ప్రజల్లో ఉంది. చైనా మద్దతు సాధించడం ద్వారా అమెరికాకు అడ్డుకట్ట వేశారనడంతోపాటు ప్రపంచ వ్యవహారాల్లో అమెరికా దూకుడును తగ్గిస్తున్నారని రష్యా ప్రజలు భావిస్తున్నారు. ఉక్రెయిన్ నుంచి క్రిమియాను స్వాధీనం చేసుకున్నారు. రష్యా చుట్టుపక్కల సోవియట్ యూనియన్ రిపబ్లిక్ దేశాలకు అమెరికా వత్తాసుగా నిలుస్తున్నా పుతిన్ ముందుకు పోవడం ఆదేశ ప్రజల్లో గౌరవాన్ని కలిగించింది. ఏదేశ అధ్యక్షుడైనా పుతిన్‌తో జాగ్రత్తగా మెలగవలసిందే.. ఎందుకంటే సీక్రెట్ ఏజెంట్స్ అధికారిగా ఆయనకు అన్ని విషయాలు తెలుసు. రానున్న కాలంలో అంతర్జాతీయంగా ఆయన తన ప్రభావాన్ని, ప్రభావాన్ని చూపుతారనడంలోఎటువంటి సందేహం లేదు.

**శాంతి స్థాపనకు కృషి**

సిరియాలోని రసాయనాయుధాల నిర్మూలనకు, ఆ దేశంపై అమెరికా క్షిపణి దాడుల నివారణకు, సిరియా సంక్షోభాన్ని రాజకీయంగా, దౌత్యపరంగా పరిష్కరించేందుకు చొరవ చూపుతూ పుతిన్ శాంతి స్థాపనలో నిమగ్నమయ్యారని, ఆయన పేరును ఓ అంతర్జాతీయ సంస్థ నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదించింది.

– బోస్

## హీరో శివాజీపై మాణిక్యాలరావు ఫిర్యాదు



సినీనటుడు, ప్రత్యేక హోదా సాధన సమితి నేత శివాజీ ఇటీవల ఓ జాతీయ పార్టీపై తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దక్షిణాదిన ఓ జాతీయ పార్టీ కుట్ర పన్నిందని తెలుగు రాష్ట్రాల్లో ఆపరేషన్ ద్రవిడ పేరుతో ఇతర పార్టీలను బలహీనపరుస్తుందని ఆయన అన్నారు. ఆయన ఆరోపణలపై బీజేపీ నేత, ఏపీ మాజీ మంత్రి మాణిక్యాలరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. శివాజీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ రోజు ఆయన ఏపీ డీజీపీ మాలకొండయ్యను కలిశారు. శివాజీ ఆపరేషన్ ద్రవిడ అంటూ ఓ వీడియో విడుదల చేశారని దాన్ని పరిశీలించి కేసు నమోదు చేయాలని డీజీపీని కోరారు.

## బాంబు కోసం వెతికితే బంగారం దొరికింది

**న్యూఢిల్లీ :** స్థానిక ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని వాష్ రూమ్‌లో 3 కేజీల బంగారం దొరికినట్లు కస్టమ్స్ అధికారులు తెలిపారు. బాంబు ఉందనే సమాచారంతో విమనాశ్రయంలో సిఐఎస్ఎఫ్ బలగాలు బాంబు స్క్వాడ్‌ను రంగంలోకి దింపాయి. ఈ సోదాల్లో మహిళల వాష్‌రూంలో రూ. 90 లక్షల విలువ గల బంగారం దొరికినట్లు అధికారులు చెప్పారు. తెల్లని పేపర్ టేప్‌లో చుట్టి ఉన్న ఒక ప్యాకెట్‌లో 3 కిలోల బరువున్న 3 బంగారు బిస్కెట్లు ఉన్నాయని, ఒక్కొక్కటీ ఒక కేజీ బరువుందని తెలిపారు. దీంతో కస్టమ్స్ అధికారులకు సమాచారం అందించి బంగారాన్ని వారికి అప్పగించామని సిఐఎస్ఎఫ్ అధికారులు పేర్కొన్నారు. దర్యాప్తు ప్రారంభించామని, మిగిలిన వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని కస్టమ్స్ అధికారులు తెలిపారు.

## ఏవోబీలో మావోయిస్టుల బహిరంగసభ

**విశాఖపట్టణం:** ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో నిషిద్ధ మావోయిస్టులు బహిరంగ సభను నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ సభకు సరిహద్దులోని దాదాపు 20 గ్రామాలకు చెందిన గిరిజనులు హాజరైనట్లు సమాచారం. ఈ సందర్భంగా భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 87వ వర్ధంతి సందర్భంగా వారికి మావోయిస్టు నేతలు ఘనంగా నివాళి అర్పించినట్లు తెలుస్తోంది. కాగా... ఈ బహిరంగసభకు మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీకి చెందిన సభ్యులు హాజరైనట్లు తెలుస్తుండగా సభకు హాజరైన గిరిజనులకు మావోయిస్టులు పలురకాల సామాగ్రిని పంపిణీ చేసినట్లు సమాచారం.

## లక్ష్మీనారాయణ స్వచ్ఛంద పదవీ విరమణ

### సీబీఐ మాజీ జేడీ రాజకీయల్లో చేరుతారని ప్రచారం



**ముంబై :** సీబీఐ మాజీ జేడీ వి.వి.లక్ష్మీనారాయణ స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్)కు దరఖాస్తు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. స్వచ్ఛంద పదవీ విరమణకు అనుమతి కోరుతూ మహారాష్ట్ర డీజీపీ ద్వారా ప్రభుత్వానికి లేఖ రాశారు. కర్నూలు జిల్లాకు చెందిన లక్ష్మీనారాయణ 1990లో ఐపీఎస్‌కు మహారాష్ట్ర క్యాడర్‌కు ఎంపికయ్యారు. మహారాష్ట్ర ఏటీఎస్‌లో ఎస్పీ, డీఐజీగా, థానే సంయుక్త పోలీస్ కమిషనర్‌గా పని చేసి ప్రసుత్తం మహారాష్టట అదనపు డీజీగా కొనసాగుతున్నారు. ఆయన కేంద్ర సర్వీసుల్లో ఉన్నప్పుడు సీబీఐ హైదరాబాద్ విభాగం డీఐజీ సంయుక్త సంచాలకుడిగా పని చేశారు. సీబీఐ అధికారిగా వైసీపీ అధినేత జగన్ అక్రమాస్తులు, ఓబుళాపురం మైనింగ్ కంపెనీ, ఎమ్మార్, సత్యం కుంభకోణం. ఆజాద్ ఎన్‌కౌంటర్ వంటి కీలక కేసుల్లో దర్యాప్తు బాధ్యతలు నిర్వహించారు. కేంద్ర సర్వీసుల అనంతరం తిరిగి మహారాష్ట్రలో విధుల్లో చేరినప్పటికీ లక్ష్మీనారాయణ తరచుగా తెలుగు రాష్ట్రాల్లో వివిధ సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులను ఉత్తేజపరిచే ప్రసంగాలు చేస్తూ వస్తున్నారు.సుమారు ఏడేళ్ల సర్వీసు ఉన్నప్పటికి ఆయన ఐపీఎస్‌గా వైదొలగాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అయితే ఆయన రాజకీయాల్లో చేరుతారనే ప్రచారం కూడా జరుగుతోంది.

## పీఎంఏవై–ఎన్‌టీఆర్ పథకం

# పట్టణాలకు 23,962 ఇళ్లు

**రాజధాని ప్రతినిధి,అమరావతి :** ప్రధానమంత్రి ఆవాస్ యోజనా (పీఎంఏవై) ఎన్‌టీఆర్ పట్టణ గృహనిర్మాణ పథకం కింద రాష్ట్రంలోని 13 పట్టణాలకు 23, 962 ఇళు మంజూరయ్యాయి. 2017 –18కు ఈ ఇళ్లను మంజూరు చేస్తూ గృహనిర్మాణశాఖ ఎక్స్ అఫిషియో కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. రూ.838.67 కోట్ల వ్యయంతో పట్టణ ప్రాంతాల్లో ఈ ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ఇంటిని రూ.350 లక్షల వ్యయంతో నిర్మించనుండగా, అందులో కేంద్ర ప్రభుత్వం రూ.1.50 లక్షలు, రాష్ట్రం రూ. లక్ష సబ్సిడీ ఇవ్వనున్నాయి. మిగిలిన మొత్తంలో లబ్ధిదారులు రూ.25 వేలును భరిస్తే, బ్యాంకుల నుంచి రూ.75 వేలు


- ఒక్కో యూనిట్‌కు రూ.350 లక్షలు
- కేంద్ర సబ్బిడీ రూ.లక్షన్నర, రాష్ట్ర సబ్బిడీ రూ.లక్ష

రుణం లభిస్తుంది. ఇప్పటికే పీఎంఏవై–ఎన్‌టీఆర్ పట్టణ గృహనిర్మాణ పథకం కింది రాష్ట్రానికి రెండు దశలలో 1.76 లక్షల ఇళ్లు మంజూరవ్వగా, తాజాగా మరో 23,962 ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. లబ్ధిదారుడే సొంతంగా ఇంటి నిర్మాణాన్ని చేపట్టే విధంగా ప్రభుత్వం గైడ్‌లైన్స్‌ను రూపొందించింది. రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు ఈ పథకం కింద ఇళ్లను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఆయామున్సిపల్ కమిషనర్లు లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. రూ.3.50 లక్షలతో ఈ ఇళ్లను 323 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.మొత్తం రూ.838.67 కోట్లలో కేంద్ర ప్రభుత్వం రూ.359.43 కోట్లను, రాష్ట్ర ప్రభుత్వం రూ.239.62 కోట్లను సబ్సిడీగా ఇవ్వనుండగా,లబ్ధిదారులు రూ.59 కోట్లను భరించాల్సి ఉంది. మిగిలిన మొత్తం రూ.179.72 కోట్లను లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి రుణంగా ఇప్పిస్తారు.ఆయా జిల్లాల కలెక్టర్లు తక్షణమే లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేసి ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని ప్రభుత్వం సూచించింది.

| జిల్లాపేరు | పట్టణం | మంజూరైన ఇళ్లు |
|---|---|---|
| విశాఖపట్నం | జీవీఎంసీ | 8,000 |
| విశాఖపట్నం | యలమంచిలి | 1,465 |
| విశాఖపట్నం | నర్సీపట్నం | 2,151 |
| పశ్చిమ గోదావరి | తాడేపల్లిగూడెం | 671 |
| ప్రకాశం | మర్కాపురం | 157 |
| ప్రకాశం | చీమకుర్తి | 342 |
| నెల్లూరు | నెల్లూరు | 2,518 |
| చిత్తూరు | చిత్తూరు | 1,341 |
| అనంతపురం | గుంతకల్ | 2,015 |
| అనంతపురం | రాయదుర్గం | 609 |
| కర్నూలు | ఎమ్మిగనూరు | 1,511 |
| కర్నూలు | గూడూరు | 1,142 |
| కర్నూలు | డోన్ | 2,040 |
| మొత్తం | | 23,962 |

## వైఎస్ఆర్ బయోపిక్ "యాత్ర"

సినిమా





తెలుగు లో బయోపిక్స్ కి ప్రస్తుతం భారీ డిమాండ్ ఉంది. ప్రస్తుతం తెలుగు లో ఎన్టీఆర్ బయోపిక్ అలాగే సావిత్రి బయోపిక్ కోసం చాలా మంది వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యం లో తాజాగా దివంగత ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కథ ఆధారంగా ఒక చిత్రం రూపొందబోతుంది. "ఆనందో బ్రహ్మ" మూవీ ఫేం మహి వి రాఘవ్ దర్శకత్వం లో ఈ సినిమా రూపొందబోతుంది. ఈ సినిమాలో మలయాళం సూపర్ స్టార్ అయిన మమ్ముట్టి హీరో గా నటించబోతున్నారు.

దర్శకుడు మహి మాట్లాడుతూ "ఈ మూవీ లో వై ఎస్ ఆర్ పాత్రలో మమ్ముట్టి గారు నటించేందుకు ఒకే చేసారు. ఈ చిత్రంలో మమ్ముట్టి రాజకీయ నేతగా కొత్త లుక్ లో కనిపించబోతున్నారు" అని చెప్పాడు. ఈ సినిమాకి "యాత్ర" అనే టైటిల్ ఫిక్స్ చేసారు అని అలాగే ఈ సినిమాలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి భార్య పాత్రలో నయనతార నటించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తుంది. 70 ఎంఎం ఎంటర్టైన్మెంట్స్ పై విజయ్ చిల్లా ఈ సినిమాని ప్రొడ్యూస్ చేస్తున్నాడు.

# నల్లద్రాక్ష పోషకాల దిట్ట!



ఆరోగ్యం

పండు ఏదైనా పోషకాలతో కూడినదే. ఒక్కోరకం పండులో ఒక్కోరకం విటమిన్లు ఉంటాయి. అందుకే అన్నిరకాల పండ్లు తినాలని చెబుతారు మన పెద్దలు, వైద్యులు. చాలా పండ్ల మాదిరిగానే నల్లద్రాక్ష కూడా పూర్వం నుంచీ విరివిగా వాడుకలో ఉన్నదే. ఇందులో రెండు రకాల రుచులు ఉన్నాయి తియ్యనివి, పుల్లనివి. ఇందులో ఏ రకానికి చెందినదైనా ద్రాక్షలో పోషకాలు ఎక్కువే. వీటిల్లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ద్రాక్షపళ్ళు తాజావే కాదు ఎండిపోయిన తర్వాతా తినవచ్చు. వీటినే మనం కిస్‌మిస్‌లు అంటాం. జ్యూస్‌ల రూపంలోనూ తీసుకోవచ్చు. ద్రాక్ష ఒక్క నలుపు రంగులోనే కాదు ఎరుపు, పచ్చ రంగుల్లోనూ లభ్యమవుతుంది. వీటన్నింటిలోనూ దాదాపుగా రుచి, పోషకాలు ఒకలానే ఉంటాయి. అన్నింటికంటే కొంచెం ఎక్కువ రుచిగా ఉండేది నల్లద్రాక్షే. దీనివల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలూ అపారం. ఇది డయాబెటీస్‌ని అదుపు చేస్తుంది. ఇన్సులిన్ ఉత్పత్తిని పెంచడం ద్వారా ఇది రక్తంలో షుగర్ స్థాయిలను సమతులంగా ఉంచుతుంది. నల్లద్రాక్ష మెదడు పనితీరుని క్రమబద్ధీకరిస్తుంది. దీనిని తగిన మోతాదులో తీసుకుంటే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి కూడా పెరుగుతాయి. మైగ్రెయిన్, డిమెన్షియా, అల్జీమర్స్ వ్యాధులను నివారించడంలోనూ సహాయపడుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే నల్లద్రాక్ష మెదడుకు రక్షణ కవచంగా పనిచూస్తుంది. గుండె ఆరోగ్యాన్నీ కాపాడుతుంది. ద్రాక్షలో ఉండే ఫైటో కెమికల్స్ గుండె కండరాలు దెబ్బతినకుండా చూస్తాయి. శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలను క్రమబద్ధీకరిస్తాయి, తగ్గిస్తాయి. తద్వారా గుండె పోటు, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా నివారిస్తాయి. నల్లద్రాక్షలో ఉండే కెరటోనాయిడ్స్‌ల్యుటెన్, జెక్సాథిన్‌లు కంటిచూపును మెరుగుపరుస్తాయి. రెటీనా దెబ్బతినకుండా కాపాడడం ద్వారా అంధత్వం రాకుండా నిరోధిస్తాయి. మహిళల్ని పీడించే బ్రెస్ట్ కేన్సర్‌తో సహా అన్నిరకాల కేన్సర్‌లపైనా పోరాడే శక్తి నల్లద్రాక్షకు ఉంది. ఇందులో ఉండే రెస్‌వెరట్రోల్ అనే ఒక రకమైన పదార్థం కేన్సర్ కణాలను నాశనం చేస్తుంది. జుట్టుకి మేలు చేస్తుంది. తలకు రక్తప్రసరణ సజావుగా జరిగేలా చూడడం ద్వారా వెంట్రుకలు ఊడిపోకుండా, చివరలు చిట్లిపోకుండా, తొందరగా రంగు మారిపోకుండా చూస్తుంది. జుట్టుని మృదువుగా మారుస్తుంది. దురద, చుండ్రు లేకుండా చూస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇందులో ఉండే సహజసిద్ధమైన షుగర్, ఆర్గానిక్ ఆమ్లాలు అజీర్ణం రాకుండా చూస్తాయి. తద్వారా మలబద్ధకాన్ని నివారిస్తాయి. మూత్రపిండాల సమస్యలకు నల్లద్రాక్ష మంచి మందులా పనిచేస్తుంది. ఎముకలను పటిష్టంగా ఉంచు తుంది. ఆస్టియోపోరోసిస్ రాకుండా అడ్డుకు ంటుంది. శరీరం నుంచి విషపదార్థాలను బయటకు పంపించడం ద్వారా అదనపు బరువుని తగ్గిస్తుంది. అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి చర్మాన్ని రక్షిసుంది. నల్లద్రాక్షలో ఉండే విటమిన్ సీ, విటమిన్ ఈ చర్మకణాలను పునరుత్తేజం చేస్తాయి. చర్మానికి కావలసిన తేమను అందిస్తాయి.

సమ్మర్ కోచింగ్
రాజధాని వార్తలు
రాయపూడి, పరిసర ప్రాంతగ్రామస్తులకు శుభవార్త
10వ, తరగతి ఆపై చదివిన విద్యార్థులకు
అతి తక్కువ ఖర్చుతో MS office, DTP ఇంగ్లీషు, తెలుగు నేర్పబడును.
వివరాల కోసం
94406 62699

Printed & Published by Shri Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor Shri Pattan Hussain Khan. RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : info@rajadhanivartalu.com